# 7. న్యాయం – ధర్మం

ఉద్యోగం లేకపోయినా పెద్దలు సంపాదించి ఇచ్చిన ఆస్తిపాస్తులతో చీకూచింతా లేకుండా కాలక్షేపం చేయగలుగుతున్నా. ఐతే వేరేపనేమీలేదని, ఇతరుల పనుల్లోకి తలదూర్చటం నాకు మొదటినుంచీ తలనొప్పిగానే వుండేది. ఎందువల్లనో కాని ఆ 'ఇతరులు' కూడా నన్ను బాధించేవారు కాదు. బహుశా వారి రాజకీయాలకు నేను పనికిరానివాణ్ణనే నిశ్చయానికి వారు వొచ్చి ఉండాలి.

ఒకనాడు హఠాత్తుగా వెంకయ్య నా కోసం ఎంతో ఆతృతతో వొచ్చాడు. పరిచయమున్నా స్నేహంలేని వ్యక్తి వొచ్చాడంటే పెద్దపనిపెట్టుకొనే వొచ్చివుంటాడనేది స్పష్టంగా తెలుస్తూనే వుంది. మర్యాద చేసి కూర్చోమన్నాను. కాని ఎంతో వినయవిధేయతలతో నమస్కరించి నిలబడే వున్నాడు. నాకు తెలియని గొప్పతనాన్ని దేన్నో వెంకయ్య నాకు స్పష్టీకరిస్తున్నాడనే గర్వంతో కూడిన ఆనందం నాలో తొణికిసలాడింది. అతన్ని బలవంతాన కూర్చోబెట్టి నా ఆనందాన్ని తగ్గించుకోవటం ఉచితంగా తోచలేదు.

"ఏమిటి విశేషం?" అన్నాను.

"మీరు న్యాయం, ధర్మం చెపుతారని వొచ్చాను" అన్నాడు వెంకయ్య.

ఏ పైకమో అప్పు అడుగుతాడేమోనని భయపడుతున్న నాకు, పరమానందమైంది. వూళ్ళో పేరువున్న వ్యవహారవేత్త. ఎన్నో తీర్పులు చెప్పగలిగిన సమర్థుడు – వెంకయ్య నా దగ్గిర న్యాయం, ధర్మం దొరుకుతుందని రావటం ఇన్నాళ్ళుగా నేను గుర్తించలేని అజ్ఞాతశక్తిని మేల్కొల్పినట్లయింది.

దూరం ఆలోచిస్తే నాకు తెలివితేటలకు తక్కువేముంది? నా స్నేహితుల్లో చాలామంది పూర్వీకుల ఆస్థిని తగలేశారు. నేను మాత్రం ఆస్తిని పెంచలేకపోయినా, ఉన్నదాన్ని జాగ్రత్తగా పట్టుకొస్తూనే వున్నాను. అదీగాక నేను తెలివిలేనివాణ్ణనే మాట ఎవ్వరూ ఎప్పుడూ అనుకోలేదు; నేనే నమ్మలేను కూడాను. న్యాయం ధర్మం చెప్పగలశక్తి నాలో అణిగి మణిగి వుంది; దాన్ని నేనింతవరకూ గుర్తించలేదు. ఏ అనామకుడో యీమాట అంటే నేను లెక్కచేసి వుండేవాణ్ణికాదు. సర్వసమర్థుడు వెంకయ్యే ఆ మాట అంటే నాలోని శక్తిసామర్థ్యాలు చాలా గొప్పవై ఉండాలి. నేను పెద్దమనిషిని కనుకనే వెంకయ్యలాటివాడు నా సహాయాన్ని అర్థించాడు. నాకు వొళ్ళు పరవశమై “అసలు సంగతేమిటి?” అన్నాను.

“మన శంకరయ్య లేడండి... వాడి విషయం...”

“అదే ఏమిటంట?” అన్నాను ఉద్రేకాన్ని తగ్గించుకొని; ఎందుకంటే ఏ పొలం తగాదాయో ఐతే కొట్లాటలు వరకూ వెళ్ళటంకద్దు; మధ్యలో తలదూర్చి తరువాత కట్లు కట్టించుకోవటం నాకు ఇష్టంలేదు!

“ఏం లేదండీ... మూడేళ్ళ క్రితం శంకరయ్య దగ్గిర నాలుగొందలు అప్పు తీసుకున్నాను. యీ నాటికి అది వడ్డీతో ఐదొందల పైచిలుకయింది. ఇప్పుడు ఆ డబ్బంతా కక్కమంటాడు. నాకు మరో రెండునెలలన్నా వ్యవధి యిప్పిస్తే కాని నేను తీర్చలేను... తమబోటి పెద్దలు చెపితేకాని తను వొప్పుకునేట్లులేదు. నన్ను యీ ఆపదనుంచి కాపాడండి.”

వెంకయ్య చెప్పింది చాలా సబబుగానే తోచింది. ఉన్నపళాన కక్కమంటే యెవడి తరమౌతుందీ? కొద్ది వ్యవధి ఇస్తే శంకరయ్యచేత నేను... నాలాటి పెద్దమనిషి... యిప్పించగలుగుతే వెంకయ్య ఒక వొడ్డున పడతాడు. ఇందులో మాటసహాయం చేస్తే సరిపోతుంది. అది న్యాయం కూడాను. శంకరయ్యతో కొంత ఘర్షణపడి వ్యవహారం ముదిరాకనే వెంకయ్య నా దగ్గిరికి వొచ్చివుంటాడు. ఈ చెడిన వ్యవహారాన్ని ఒక మార్గాన పెట్టటం కష్టమే! కాని నాలో నాకు లేని నమ్మకాన్ని వెంకయ్య ప్రవేశపెట్టాడు. ఆ నమ్మంతోనే నేను యీ సమస్యను విడదియ్యగల శక్తిని పొందానేమో?

కాని వెంకయ్య నా తీర్పును శిరసావహించేందుకు సిద్ధమే ఐనా మరి శంకరయ్య సంగతేమిటి? వెంకయ్య నాలో చూడగలిగిన సద్గుణపరంపరను శంకరయ్య గుర్తించాలి కదా! అలా కానిపక్షంలో వెంకయ్య నాకు అంటగట్టిన పెద్దమనిషితనం, న్యాయధర్మ పరిశీలన వగైరాలకు పెద్దదెబ్బ తగులుతుంది! అంటే శంకరయ్యను ఏదోవిధంగా మనదారికి లాక్కొని కేవలం నా గొప్పతనాన్ని ఒప్పుకునేందుకు ప్రయత్నం చేయాలి. వెంకయ్యకు సహాయం చేయటం మాట అటుంచి, నా న్యాయబుద్ధిని విస్తరించటానికే నేను విశ్వప్రయత్నం చేయవలసివుంది. అది తప్పనిసరిగా తోచింది.

"మరి శంకరయ్య మన మాట వింటాడా?" అన్నాను సందేహానికి వొచ్చే సమాధానంలోనే ముందు కార్యక్రమాన్ని నిర్ణయించుకునేందుకు వీలుగా.

"వింటాడా... అని మెల్లిగా అంటున్నారా? మీ అంత పెద్దమనిషి చెపితే కాదనేందుకు శంకరయ్యకు గుండేనా?"

బాగానేవుంది. గొప్పతనమనేది గుర్తించబడకుండా ఎలా వుంటుంది కనుక? ఐతే యీ శంకరయ్యకోసం నేనే వెళ్ళటం హాస్యాస్పదం. అది కేవలం వెంకయ్యను వెనకేసుకొని వెళ్ళటమే అవుతుంది. న్యాయం, ధర్మం చెప్పవలసినవాడు ఈ విధంగా ప్రవర్తించడుకదా? అదీగాక శంకరయ్య నేను చెప్పిన తీర్పును ఒప్పుకు తీరుతాడని వెంకయ్య అంటున్నాడు కాని, తీరా అక్కడకి వెళ్ళాక యెదురుతిరుగుతే ఆ అవమానానికి నేను యెంతగానో బాధపడాల్సి వుంటుంది. కనుక శంకరయ్యే నా దగ్గిరికి రావటం అన్నివిధాలా, అందరికీ మంచిది. నామాట ఒప్పుకునేందుకు సిద్ధపడితేనే తప్ప శంకరయ్య నా దగ్గరికి రాడు; శంకరయ్య నా దగ్గరికి వొచ్చేట్టు చేయటం వెంకయ్యవిధి; ఇది నా పెద్దమనిషితనాన్ని నిరూపించేందుకు కాదు... వెంకయ్యకు స్వలాభం యేడిసింది కనుక!

"శంకరయ్యను ఇక్కడికి కొట్టుకొని రాగలవా మరి?" అని అడిగాను.

"తమ సెలవైతే క్షణంలో రాడూ?"

"సరే ఐతే..."

వెంకయ్య విప్పారిన మొహంతో వెళ్ళిపోయాడు. నేను ఆలోచనలో పడ్డాను. గొప్పవాడి గొప్పతనాన్ని ముందు గుర్తించేది ఇతరులు. ఎవడికైనాసరే తన మొహం తప్ప ఇతరుల మొహాలన్నీ కనిపించినట్లే - తన శక్తి సామర్థ్యాలు తప్ప ఇతరుల శక్తి సామర్థ్యాలే ముందుగా కనిపిస్తవి. నేటికి నా నిజమైన విలువ బైటపడే వాతావరణం ఏర్పడబోతున్నందుకు ఎంతో గర్వం కలిగింది.

శంకరయ్యతో ఏ విధంగా మాట్లాడాలో ఆలోచించుకోక ముందే శంకరయ్య వొచ్చాడు. వొస్తూనే నమస్కరించాడు. అరె! నామాట అంటే వీళ్ళకు ఎంతగౌరవం... నేనంటే ఎంత అభిమానం; ఒళ్ళు తెలియనంతపనై తమాయించుకున్నాను.

"ఏం శంకరయ్యా... బాగున్నావా?" అన్నాను. ముందు కాస్త దువ్వి మచ్చిక చేద్దామని.

"తమ దయవల్ల బాగానే వున్నానండీ!" అన్నాడు శంకరయ్య. "ఎందుకో పిలిపించారట..." అన్నాడు వెంటనే.. నేను చెప్పబొయ్యేది శిరసావహించేందుకు సిద్ధంగా ఉన్నవాడల్లే.

"ఏం లేదు... మన వెంకయ్య విషయం..." అని నీళ్ళు నమిలాను.

"ఏం చెయ్యమంటారు? ఎన్నివాయిదాలు ఇచ్చినా బాకీ చెల్లించటంలేదు. డబ్బుకు కిటకిటగావుంది. ఆతని అవసరాన్ని నేను తీర్చాను; మరి నా అవసరానికి లేకుండా పోతే ఎట్లా చెప్పండి... మీరే న్యాయం ధర్మం చెప్పండి" అన్నాడు శంకరయ్య వినయంగా.

నేను చెప్పబొయ్యే న్యాయం, ధర్మం కోసం ప్రతివాదులు నిలబడి ఉండటం చూసేప్పటికి, నా గొప్పతనం అర్థమై తలదిమ్మెక్కింది. ఎలాగైనాసరే శంకరయ్యకు నచ్చచెపితేనే కాని నా ధర్మబుద్ధి నిరూపణ అవదు.

"అది సరే శంకరయ్యా... ఎలాగూ మూడేళ్ళు ఆగావు. మరో రెండు నెలలు ఆగు..."

"ఇంకానా?" అన్నాడు శంకరయ్య నిట్టూరుస్తూ.

"రెండు నెలలకు పంటవొస్తుంది. తీర్చుకుంటాను" అన్నాడు వెంకయ్య.

"ఔను.. ఉన్నపళాన ఎలా కుమ్మరిస్తాడు చెప్పు? పంట రాగానే తీరుస్తాడు. వెంకయ్య పెద్దమనిషి" అన్నాను. వెంకయ్య పెద్దమనిషితనం నాకు అంత బాగా తెలియకపోయినా ఆ వినయవిధేయతలూ, నాబోటి పెద్దల పట్ల అతను చూపే గౌరవమర్యాదలూ చూస్తే అర్థమౌతూనేవుంది!

"డబ్బుకు చాలా కిటకిటగా వుంది. వెంకయ్య అవసరాన్ని నేను తీర్చాను. నా అవసరానికి కాకుండాపోయింది..." అని శంకరయ్య చప్పరించాడు.

నా మాటను తోసేస్తాడేమోననే భయం నన్ను ఆవరించింది. అందుకని అన్నాను, "వెంకయ్య చాలా పెద్ద మనిషి.. కలిసిరాకపోవటం వల్ల నీ బాకీ తీర్చలేకపొయ్యాడు. నీ డబ్బుకేమీ భయంలేదులే!"

"రేపు పంటలో మాత్రం యిస్తాడని యేమిటి?" అని శంకరయ్య సవాల్ చేశాడు.

కాస్త సందుపెట్టినందుకు నాకు పరమానందమైంది. ఆలస్యం చేయకుండా అవకాశాన్ని వినియోగించాను.

"నాబోటి పెద్దమనిషి దగ్గిర మాట అన్నాక తప్పుతాడా వెంకయ్య?" అన్నాను. వెంకయ్య పెద్దమనిషితనానికి సపోర్టుగా నా పెద్దమనిషితనాన్ని నిలబెట్టాను... మరి అంతకన్న మార్గం లేదు.

ఈలోగా సాంబయ్య ఎప్పుడొచ్చాడో కాని అతని గొంతు వినేదాకా నేను గుర్తించనేలేదు.

"ఆయన అంతగా చెపుతూంటే 'సరే ననవేం శంకరయ్యా?' అన్నాడు సాంబయ్య. నా పెద్దమనిషితనాన్ని పరాయివాడైన సాంబయ్య కూడా గ్రహించినందుకు నాకు పరమానందమైంది.

"సరే. తమబోటి పెద్దలమాట కాదనేందుకు నేనెంతవాణ్ణి? పైకం రెండునెలల్లో యిప్పించాల్సిన బాధ్యత తమది."

"ఓ ! అలాగే" అన్నాను, ఇంత తేలిగ్గా పరిష్కారమౌతుందని నేను యెన్నడూ అనుకోలేదు. వ్యవహారవేత్త అవటం యెంతసులభమో అర్థమైంది. నేనుకూడా, వూళ్లో వ్యవహారాలకు మధ్యవర్తిత్వాన్ని వహించేందుకు అర్హత వున్నవాణ్ణే ! ఐతే నేడే ఆ అర్హతను శంకరయ్యా, వెంకయ్యా కలిసి నిరూపించారు.

"ఏం వెంకయ్యా?" అన్నాను.

"రక్షించారు స్వామీ !" అన్నాడు వెంకయ్య తృప్తిగా.

"మరి సెలవా?" అని శంకరయ్య నమస్కరించి వెళ్ళిపొయ్యాడు.

వెంకయ్య యెప్పుడు జారుకున్నాడో తెలియదు. మొత్తంమీద లోక కళ్యాణార్థం ఒక గొప్పపనిని చేసిన తృప్తితో నిండిపోయింది. నా ఆధిక్యతను తెలుసుకోగలిగిన జ్ఞానకాంతి నాకు దక్కింది. ఆలాగే ఆలోచిస్తూ పడక కుర్చీలో కళ్ళు మూశాను.

* * *

క్రమంగా యీ తీర్పును గూర్చి మరిచిపొయ్యాను. మరెవ్వరూ నా తీర్పులకోసం రాకపోవటమే దీనికి కారణమై వుండొచ్చు.

ఒకనాడు ఉదయాన్నే శంకరయ్య ప్రత్యక్షమయ్యాడు. మరో తీర్పుకోసం వొచ్చాడేమోననుకున్నాను.

"చూడండి... వెంకయ్య వ్యవహారం!" అన్నాడు. మొహం చిటచిట లాడుతోంది. ఏదో రసాభాస ఐవుంటుందని అర్థమౌతూనేవుంది. నేను చెప్పిన తీర్పుకు రెండునెలల వయసు దాటిందని కూడా ఇప్పుడే తెలుసుకున్నాను.

"ఏమైందీ..?" అన్నాను.

"పంట రానూ వచ్చింది... అమ్ముకొని తిననూ తిన్నాడు..."

నాకు వొళ్ళుమండింది. వెంకయ్య ఇంత నీచంగా ప్రవర్తిస్తాడనుకోలేదు. ఏదో మంచివాడని, పెద్దమనిషని నేను అతని పక్షాన పోరాడి వ్యవధి ఇప్పిస్తే యీ విధంగా దుర్వినియోగపరుస్తాడనుకోలేదు. శంకరయ్య నిజంగా పెద్దమనిషి కనుకనే నేను చెప్పిన తీర్పుకు బద్ధుడై వున్నాడు. నా తీర్పును తృణీకరించి నన్ను అవమానించిందల్లా.. వెంకయ్య!

"కనుక్కుంటాను ఆగు" అన్నాను.

"కనుక్కోవటం కాదు... తేల్చెయ్యండి."

"సరే" అన్నాను తప్పక.

వెంకయ్య కోసం కబురుచేశాను, రాలేదు. ఎన్ని కబుర్లు చేసినా టలాయిస్తున్నాడు. అతను రాకపోవటమే అతని కల్మషాత్మకు నిదర్శనం. శంకరయ్య పోరు జాస్తయింది. మరో మార్గంలేక నేనే వెంకయ్య ఇంటికి బయలుదేరాను.

అష్టకష్టాలూపడి వెంకయ్యను వెదికి పట్టుకున్నాను.

"ఏం ఇలా చేశావ్" అన్నాను కోపంతో.

"ఏం చెయ్యమంటారు...పంటలో అనుకున్నంత రాలేదు. ఇంటి ఖర్చులు అనుకోకుండా పెరిగిపోయినవి. పై పంటలో తప్పక తీరుస్తాను." అన్నాడు.

ఇదేమిటి... ఇలా చేస్తాడని నేనెన్నడూ అనుకోలేదు. యీ సంగతి శంకరయ్యకు చెప్పి వొప్పించటం సాధ్యమా? యీ రెండునెలల గడువుకే నా చాకచక్యాన్నంతట్నీ ఉపయోగించాను. ఇప్పుడు మళ్ళీ గడువిప్పించటం నాకు తలకు మించినపని. పోనీ ఆ ప్రయత్నం తరువాత చేయవచ్చు. ముందు యీ వెంకయ్య ప్రవర్తననుగూర్చి విచారణ జరగాల్సిందే!

"ఇదేం బాగాలేదు వెంకయ్యా..." అన్నాను కాస్త మెత్తగానే. కారం రాచుకున్నట్లు ప్రవర్తిస్తే అసలుకే మోసం వొస్తుందనే భయంతో. ముళ్ళమీద ఆరేసినబట్టను తీసేప్పుడు ఉపయోగించే జాగ్రత్తను మరిచిపోలేదు.

"శంకరయ్యను ఒప్పించగలమా?"

"తమబోటి పెద్దలు చెపితే తప్పక ఒప్పుకుంటాడు..." అని నసిగాడు.

ఏమని చెప్పి ఒప్పించేది? నన్ను పెద్దమనిషిగా, మధ్యవర్తిగా వుంచి, యీ స్థితికి దింపారు. ఇంకా గడువు ఇప్పిస్తే మిగిలివున్న యీకాస్త పెద్దమనిషితనం కూడా హరించుకొనిపోతుంది.

వెంకయ్య మీద విసుక్కున్నాను. కోప్పడ్డాను. రెండు మూడు దూషణ వాక్యాలుకూడా ఉపయోగించాను. కాని వెంకయ్యలో చలనంలేదు. వొంచిన తల ఎత్తలేదు. నోరు నొప్పిపెట్టి ఇంటిదారి పట్టాను.

శంకరయ్య నాకోసమే కాచుకొని కూర్చున్నాడు. అసలే విసుగ్గావున్న సమయంలో యీ త్రాష్టుడు ఎదురువటం వొంటిమీద గొంగళీపురుగులు పాకట మల్లేనేవుంది. ఐనా తమాయించుకున్నాను.

"ఏమైందీ?" అన్నాడు శంకరయ్య.

"పైపంటకు ఇస్తానంటాడు!" అన్నాను.

"ఏమండీ... మీరు చెప్పబట్టి వూరుకున్నాను. ఏం చేశాడో చూశారుగా! పెద్దమనిషన్నారే!"

"మరి ఏంచేద్దామంటావు?" అన్నాను రాజీగా.

"నా పైకం ఇప్పించండి.."

"ఎలాగంట?"

"ఎలాగో నాకేం తెలుసు? మీ అవస్థలు మీరుపడి నా బాకీ ఇప్పించివేయండి. తమ బాధ్యత మీదనే నేను వూరుకున్నానుకదా?"

"పై పంటదాకా ఆగటంతప్ప మరో మార్గం ఏముందీ?"

"మార్గం మీరే ఆలోచించండి. రెండు రోజుల్లోగా నాకు పైకంకావాలి.."

నాకు ఛర్రుమంది.

"ఐతే నన్ను యిచ్చుకోమంటావా యేం?" అన్నాను. నే నిస్తే కాదనడని తెలియకకాదు. అతని వుద్దేశ్యం అదేనేమోనని!

"నాకు అనవసరం. ఎవరైనా కానివ్వండి. ఇవ్వాల్సిందే! నాకు పైకం ముట్టచెప్పవలసిన బాధ్యత తమ మీద వుంది–"

"నామీదా! యేదో తగాదాపడితే సర్దేందుకు చూశాను కాని, నాకు బాధ్యతేమిటి?" అన్నాను.

"బాధ్యత మీరు తీసుకున్నారు కనుకనే ఆనాడు నేను వూరుకున్నాను. లేకుంటే నా అవస్థ నేను పడేవాణ్ణి..."

"అందుకని నన్ను యిచ్చుకోమంటావా?"

"నేను అనను, కాని నాకు పైకం ముట్టచెప్పించండి. పెద్దమనుషులకు ఒకే నాలుక కదా!..."

నా పెద్దమనిషితనాన్ని శంకించటం వరకూ వ్యవహారం ముదిరింది!

"శంకరయ్యా! వెంకయ్య పైకం ఇచ్చేట్లుగా ప్రయత్నం చేస్తాను కాని అది కాకపోతే నీ అవస్థ నువ్వేపడి మీరిద్దరూ కట్టకట్టుకొని గంగలో దూకండి. అంతేకాని నేనేం చేసేదీ?" అన్నాను.

"ఈనాడు మీరు చేతులు కడుక్కుంటే సరిపోతుందనుకున్నారా? ఆనాడు మీరు మాట అడ్డంవేయకుంటే నేను యేం చేసుకునేవాణ్ణో మీకు అనవసరం. మీ బాధ్యతను యింత తేలిగ్గా మరిచిపోతారనుకోలేదు..."

నాకు కారం రాచినట్లయింది.

"ఏమిటి నీ వుద్దేశ్యం?" అన్నాను నిలదీసి.

"ఏ పెద్దమనిషికన్నా చెప్పండి... యేమంటాడో!" అన్నాడు శంకరయ్య.

నేనే ఒక పెద్దమనిషినై వుండి ఇంకో పెద్దమనిషికోసం వెళ్ళటంకన్న తలవొంపులు వుండబోదు. ఐతే లోగడ పెద్దమనిషితనాన్ని డబ్బు ఖర్చులేకుండా సంపాయించాను. ఇప్పుడు ఆ పెద్దమనిషితనాన్ని నిలబెట్టుకునేందుకు వెంకయ్య బాకీని నేనే చెల్లించవలసిన పరిస్థితి యేర్పడింది. ఎప్పుడైతే 'డబ్బు' ఇందులో ఇరికిందో కాస్త దూరంగా వుండటమే శ్రేయస్కరంగాతోచి "అది నావల్ల కాదు..." అన్నాను.

"ఆ రోజున సాంబయ్యగారు కూడా వున్నారు. ఆయన్ని చెప్పమనండి" అన్నాడు శంకరయ్య.

"ఆయన చెప్పటమేమిటి?" అన్నాను కోపంతో వొణికిపోతూ.

"అనాడు ఆయనకూడా వున్నారుగా! మీరేదో వొరగబెడతామని చేసిన వాగ్దానాన్ని ఆయన మరిచిపోయి వుండరు..."

"నాకు యెవరి అభిప్రాయాలతోనూ పనిలేదు" అని, జవాబుకు యెదురు చూడకుండానే లోనికి వెళ్ళిపోయాను.

అరగంట గడిచేప్పటికి, సాంబయ్యతో సహా శంకరయ్య యింటిముందు దిగాడు. ఇందాకటి మంట తగ్గక ముందే మళ్లీ రభస ప్రారంభం.

"ఏమండీ సాంబయ్యగారూ!" అన్నాను.

"ఏంలేదు... ఆనాడు జరిగినదానికి సాక్ష్యంగా శంకరయ్య నన్ను తీసుకొచ్చాడు."

"చూడండి.. ఆ డబ్బు నన్ను ఇచ్చుకోమంటాడు; యిదేం న్యాయం స్వామీ?" అన్నాను.

"మీరివ్వటం కాదుకానండి, ఇప్పించాల్సిన బాధ్యత మాత్రం తమదే!"

నాకు చచ్చినంత పనైంది. రెండు ఆబోతులమధ్యా యిరుక్కున్న లేగదూడస్థితిలో పడ్డాను.

"అలాగైతే పైపంటదాకా ఆగమనండి" అన్నాను. ఓడిపొయ్యే కేసును ఏదో విధంగా సరిచేసేందుకుగాను ప్రయత్నించే లాయర్‌లాగు.

"ఎట్లా? మీరు రెండు నెలలు వాయిదా ఇప్పించారు. అంతవరకూ ఆగనే ఆగాడు" అన్నాడు సాంబయ్య.

అటుతిరిగీ ఇటుతిరిగీ ఇది నామెడకే చుట్టుకుంది, తీర్పు చెప్పిన న్యాయాధికారికి ఆ తీర్పును అమలు జరిపేందుకు పోలీసుల సహాయం ఉంటుంది. నాకు అలాటి అవకాశాలేమీ లేవు.

"నన్ను ఏం చేయమంటారు?" అన్నాను సగం చచ్చి.

"అతని చేత ఇప్పించండి. లేదా ఆపైకం మీరే ఇచ్చుకొని వెంకయ్య దగ్గర వసూలు చేసుకోండి" అన్నాడు శంకరయ్య.

నిస్సహాయంగా సాంబయ్య మొహంవొంక చూశాను. సాంబయ్య "అంతే" అన్నట్లు తల ఆడించాడు.

వెంకయ్య దగ్గర వసూలు చేసి ఇవ్వటం నాకు తలకు మించిన పని! శంకరయ్యలాటివాడికే సాధ్యమవలేదు. పోతే నేను ఇచ్చుకోవడం ఒక్కటే మిగిలింది. సాంబయ్యలాటివాడు కూడా శంకరయ్య వైపే మొగ్గుతున్నాడు. వూళ్ళో ఇంకెవరి దగ్గిరికెళ్ళినా ఇంతకుమించిన న్యాయం దొరుకుతుందనే నమ్మకం నాకు కలగటం లేదు. పైపెచ్చు నేను చేసిన వెధవ పనినికూడా విమర్శిస్తారు. నా పెద్దమనిషితనాన్ని నిలబెట్టుకునేందుకుగాను రభస కాకుండా చూచుకోవటం అవసరమైంది.

"సరే. చూస్తాను" అన్నాను.

"చూడటం కాదు; రెండు రోజుల్లో నాపైకం ఇప్పించాలి" అని ఇద్దరూ వెళ్ళిపోయారు.

'ఇప్పించాలి' అంటే 'ఇవ్వు' అనటమే! రెండురోజుల్లోనూ వెంకయ్య వెంటపడ్డాను కాని ప్రయోజనం లేకపోయింది. చూస్తూండగానే గోళ్లూడగొట్టినట్లు, శంకరయ్య ఐదువందలూ వసూలు చేసుకొని వెళ్ళాడు.

వారం గడవక ముందే వెంకయ్యా, శంకరయ్యా ఎంతో స్నేహంగా జల్సాగా పట్టణానికి బయలుదేరారని తెలిసింది. అది మొదలూ ఇంత ఖరీదైన యీ పెద్దమనిషితనాన్ని ... న్యాయం, ధర్మం తెలిసిన నేను మరెన్నడూ దాన్ని వినియోగించకూడదని నిశ్చయించుకున్నాను.

– నవంబర్, *1952*